సాక్షి నిర్మల్
ఆదివారం । 14 । జనవరి । 2024



నోరూరించే 'గేవర్'

భైంసా ప్రాంతంలో సంక్రాంతికి పిండి వంటలతో పాటు మిఠాయి దుకాణాల్లో లభించే గేవర్ అనే స్వీట్‌కు ప్రత్యేక స్థానం ఉంది. కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో అందుబాటులో ఉంటోంది.
9లో▸



నాగోబా మహాపూజకు శ్రీకారం

వచ్చే నెల 9న నిర్వహించనున్న నాగోబా మహాపూజకు మెస్రం వంశీయులు శ్రీకారం చుట్టారు. కేస్లాపూర్‌లోని నాగోబా మురాడి వద్ద శనివారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు.
10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.1 /16.7

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువగా నమోదవుతాయి. చలి ప్రభావం తగ్గుతుంది. ఉదయం పొగమంచు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దీప్తి ఆత్మహత్య ఘటనపై విచారణ జరిపించాలి

ఖానాపూర్: హన్మకొండ ఎస్‌ఆర్ యూనివర్సిటీలో రాథోడ్ దీప్తి అనే విద్యార్థిని ఆత్మహత్య సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దోషులకు చట్టరీత్యా శిక్ష పడేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ఆత్మహత్య విషయాన్ని తల్లిదండ్రులకు ఆలస్యంగా తెలియజేయడంతో పాటు మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రికి తరలించడంలో యాజమాన్యం తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. యూనివర్సిటీ మేనేజ్‌మెంట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గెస్ట్ లెక్చరర్ల కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన నూతన కార్యవర్గం

నిర్మల్: జిల్లా జూనియర్ కళాశాలల గెస్ట్ లెక్చరర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు నార్వాడే వెంకట్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో శనివారం ఎన్నికలు నిర్వహించారు. సంఘం ఉపాధ్యక్షుడిగా సాయినాథ్, కోశాధికారిగా సిలారి ముత్యం, ప్రధాన కార్యదర్శిగా ఎస్.రాజు, మహిళా ప్రధాన కార్యదర్శిగా సాయిప్రియ, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా షేక్ పర్వేజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జూనియర్ కళాశాల అతిథి అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఐకమత్యంగా పరిష్కరించుకుందామని వెంకట్‌రావు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

దేవరకోటలో పల్లకిసేవ


స్వామివారి పల్లకిని ఊరేగిస్తున్న భక్తులు

నిర్మల్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్థానిక దేవరకోట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పల్లకిసేవ నిర్వహించారు. లక్ష్మీవేంకటేశ్వరుల ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది. అనంతరం తిరుప్పావై ప్రవచనాలను రామకన్నన్ ప్రవచించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆమెడ శ్రీధర్, ధర్మకర్తలు గంగాధర్, దేవేందర్‌గౌడ్, అర్చకుడు నవీన్, భక్తులు పాల్గొన్నారు.

భోగభాగ్యాల భోగి

- నేటి నుంచి మూడురోజుల పాటు పండుగ
- ఇతర ప్రాంతాల్లో స్థిరపడినవారు ఇప్పటికే సొంతూళ్లకు రాక

నిర్మల్‌ఖిల్లా: సంక్రాంతికి ఒక రోజు ముందు భోగి పండుగతో సంబరాలు షురూ అవుతాయి. భోగి అంటే భోగభాగ్యాలను అనుభవించే రోజు అని అర్థం. పాడి పంటలు సమృద్ధిగా ఇండ్లకు వచ్చే సమయం. ఈ రోజు సూర్యోదయానికి పూర్వమే నిద్ర లేచి అభ్యంగన స్నానానంతరం ప్రతీ ఇంటి ముందు భోగి మంటలు వేసుకుని పాతకు స్వస్తి చెప్పి నూతనత్వానికి స్వాగతం పలుకుతారు. భోగి మంటలలో పాత, పనికిరాని బట్టలను, వస్తువులను వేసి పీడలను, అరిష్టాలను తొలగించుకుంటారు. తెల్ల వారక ముందే భోగి మంటలతో మొదలుకుని కుటుంబంలో ఆనంద కోలాహలం ప్రారంభం అవుతుంది. మనలో ఉన్న బద్ధకాన్ని, అశ్రద్ధను, మనసులో ఉన్న చెడు తలంపులను ఈ భోగి మంటల్లో వేసి ఈ రోజు నుంచి నూతన ఆనంద, ఆప్యాయతలతో కూడుకుని ఉన్న జీవితాన్ని ప్రారంభిస్తున్నామని ఆత్మారామునికి మాటఇచ్చి భగవత్ సన్నిధిలో నిశ్చయ సంకల్పం చేసుకునే రోజు. మూడు రోజుల పాటు జరిగే సంక్రాంతి పండుగ కొత్త ఆనందాలను మోసుకొస్తుంది.


జిల్లా కేంద్రంలో గంగిరెద్దును ఆడిస్తూ...



▶ భోగి పండ్ల విశిష్టత

నేడు చిన్నారులపై భోగి పండ్లు పోస్తే వారి మీద ఏమైనా పీడ ఉంటే వదులుతుందని తల్లిదండ్రుల నమ్మకం. భోగి పండ్లను పోయడం అంటే నరదృష్టిని తొలగించడం. రాత్రి వేళ ప్రధాన కూడళ్ల వద్ద భోగి మంటలు ఏర్పాటు చేస్తారు.

▶ మూడు రోజుల పాటు..

భోగి, సంక్రాంతి, కనుమ.. ఇలా మూడు రోజులు ప్రతీఇంట సంతోషమే. తొలి రోజు జరుపుకునే భోగి పండుగకు ప్రత్యేకత ఉంది. 'భగ' అనే పదం నుంచి భోగి వచ్చిందని పెద్దలు చెబుతారు. దక్షిణాయనానికి చివరి రోజుగా భోగిని భావిస్తారు. అందుకే దక్షిణాయనంలో పడ్డ కష్టాలు, బాధలను భోగి మంటల రూపంలో అగ్నిదేవుడికి సమర్పించి రాబోయే ఉత్తరాయణ కాలంలో సుఖసంతోషాలను ప్రసాదించాలనే పరమార్థమే భోగి పండుగ విశిష్టత. భోగి నాడు తెల్లవారుజామునే నిద్ర లేచి భోగిమంటలు వేయడం ఆనవాయితీ.


ముగ్గులు వేస్తున్న చిన్నారులు

▶ భోగి సంప్రదాయమిదే...

ఆవు పేడతో తయారుచేసిన పిడకలు, మామిడి, రావి, మేడిచెట్ల అవశేషాలు, తాటాకులు లాంటివి భోగి మంటల్లో వేస్తారు. అంతేకాదు ఇంట్లోని పాత వస్తువులను కూడా భోగి మంటల్లో వేస్తుంటారు. అంటే పనికిరాని చెత్త ఆలోచనలకు స్వస్తి పలికి.. కొత్తమార్గంలోకి పయనించాలని దీని అర్థం. భోగి రోజు బొమ్మల కొలువు, ముత్తైదువులతో పేరంటం కూడా చేస్తారు. ముఖ్యంగా భోగి పండుగ రోజు పెద్దలు తమ ఇంట్లోని చిన్నారుల తలపై రేగిపళ్లు పోస్తారు. భోగిపండ్ల కోసం రేగుపండ్లు, చెరుకుగడలు, బంతిపూల రెక్కలు, చిల్లర నాణేలు వాడతారు. కొందరు శనగలు కూడా కలుపుతారు. రేగి పళ్లను పిల్లల తల మీద పోయడం వల్ల శ్రీమన్నారాయణుడి దివ్య ఆశీస్సులు లభిస్తాయని భావిస్తారు. భోగి పండ్లు పోయడం వలన పిల్లల మీద ఉన్న చెడు దృష్టి తొలగిపోతుందని నమ్మకం.

▶ సెలవులకు సొంత ఊరికి ...

జిల్లాలోని సారంగాపూర్ మండలంలో గల జామ్ గ్రామానికి చెందిన జగ్గని భోజన్న మహబూబ్‌నగర్ జిల్లాలోని బాలనగర్ ప్రాంతంలోగల గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పీజీటీగా పనిచేస్తున్నారు. కుటుంబ సమేతంగా అక్కడే ఉంటున్నారు. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో స్వగ్రామమైన జామ్‌కు శుక్రవారం వచ్చారు. సంక్రాంతి సెలవుల్ని సొంత ఊరిలో జరుపుకోవాలని భార్య పిల్లలతో వచ్చేశారు. ఇక్కడే భోగి, సంక్రాంతి, కనుమ పండగలను అమ్మానాన్న, కుటుంబ సభ్యుల సమక్షంలో జరుపుకుంటానని 'సాక్షి'తో పేర్కొన్నారు.


భోజన్న కుటుంబం

▶ 15న మకర సంక్రాంతి

సంక్రాంతి అంటే గమ్యం అని అర్థం. సూర్యుడు ధనురాశి నుంచి మకరరాశిలోకి ప్రవేశించే శుభదినం. ఈ రోజు తెలంగాణ ప్రాంతంలోని దక్షిణాది జిల్లాల్లో నువ్వులు, బెల్లం కలిపి లడ్డూలు చేస్తారు. సకల సౌభాగ్యాలకోసం సంక్రాంతి నోము నోచుకుంటారు. మకర సంక్రమణం రోజు నువ్వుల నూనెలో లక్ష్మీదేవి కొలువై ఉంటుందని ప్రతీతి. అందుకే లక్ష్మీదేవిని పూజించి నువ్వుల లడ్డూలను ప్రసాదంగా స్వీకరిస్తారు. అలా చేస్తే నూరేళ్ల ఆయుష్షు కలుగుతుందని శాస్త్రవచనం.


సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు

▶ 16న కనుమ..

సంక్రాంతి మరుసటి రోజు కనుమ జరుపుకోవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. కనుమ పండుగను కల్పపండుగ అని కూడా అంటారు. ఈరోజు రైతులు తమ ఎడ్లను అందంగా అలంకరించి పూజిస్తారు. పశువులను దైవంగా భావించి పూజించడం కనుమ ప్రత్యేకత.


స్టీల్ సామాన్లు కొనుగోలు చేస్తున్న మహిళలు


పిల్లలకోసం స్వీట్లు కొనుగోలు చేస్తున్న మహిళలు


రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు


గాలిపటాలు కొనుగోలు చేస్తున్న చిన్నారులు

పిండి వంటలు మస్తు పిరం!

- కొండెక్కిన సన్నబియ్యం ధరలు
- కొనలేకపోతున్న సామాన్యులు..
- సంక్రాంతి వంటకాల తయారీకి వెనుకంజ

నిర్మల్ ఖిల్లా: బియ్యం ధరలకు రెక్కలు వచ్చేశాయి. నెలక్రితం ఉన్న ధరలకు ఇప్పటికీ గణనీయంగా పెరిగిపోయాయి. సామాన్యులు కొనలేని పరిస్థితికి చేరుకున్నాయి. దీంతో సంక్రాంతి పండగ పిండి వంటల తయారీకి మహిళలు వెనుకంజ వేస్తున్నారు. గతేడాది పండించిన పంట కన్నా రెట్టింపు దిగుబడి ఈసారి వచ్చినా.. బియ్యం ధరలు మాత్రం బహిరంగ మార్కెట్లో ఎక్కువ రేటు పలుకుతున్నాయి. ఇక్కడ పండించిన ధాన్యాన్ని దళారులు అధిక ధరలకు పొరుగు రాష్ట్రాలకు తరలిస్తుండడంతోనే బియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్నాయని అంటున్నారు. జిల్లాలోని ముధోల్, నిర్మల్ ఖానాపూర్ తదితర పరిసర ప్రాంతాల్లో వరిపంట ఎక్కువగానే పండిస్తున్నారు. జిల్లాలో ఈ సీజన్లో రైతుల నుంచి సుమారు 1.40 లక్షల టన్నులకు పైగా ధాన్యాన్ని సేకరించారు. అయినా బియ్యం ధరలు సామాన్యులకు చుక్కలు చూపెడుతున్నాయి.

బహిరంగ మార్కెట్లో ఇలా..

జిల్లాలో బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు పెరగడంతో దిగువ మధ్యతరగతి కుటుంబాల వారు, ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నవారు ఇంత ధరపెట్టి కొనలేమంటున్నారు. మా ర్కెట్లో సన్న రకాలైన జై శ్రీరామ్ -7,200, హెచ్‌ఎంటీ రైస్- 6,900, జై శ్రీరామ్ (పాతవి)- 6,800, జైశ్రీరామ్(కొత్తవి)- 5,800, సాధారణ బీపీటీ రైస్- 5,500, జైశ్రీరామ్ (స్టీమ్ రైస్) 6,100, బాస్మతి-12 వేలు, సోనామసూరి-6,200 ధర పలుకుతున్నాయి.


మార్కెట్లో అమాంతం పెరిగిన బియ్యం ధరలు

కందిపప్పు ధరలు అందనంతస్థాయికి...

ప్రతి ఇంట్లో నిత్యం వాడే కందిపప్పు ధర ప్రస్తుతం అందనంత స్థాయికి చేరుకుంది. ఆరు నెలల క్రితం కిలోకు రూ.120 ఉన్న కందిపప్పు ధర ప్రస్తుతం రూ.170 నుండి 190 వరకు విక్రయిస్తున్నారు.

అల్లం వెల్లుల్లి కూడా ప్రియమే..

వెల్లుల్లి ధర రూ.120 నుంచి ప్రస్తుతం రూ.320 వరకు చేరుకుంది. అల్లం ధర కూడా కిలోకు రూ.80 ఉండగా ప్రస్తుతం రూ.180 నుంచి రూ.200 వరకు పలుకుతోంది. వీటి దిగుబడులు లేక డిమాండ్ పెరిగిందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

పిండి వంటలు ఎలా..

సంక్రాంతి పండగ నేపథ్యంలో పిండి వంటల గురించి మధ్యతరగతి మహిళలు హైరానా పడుతున్నారు. పండగ సెలవులకు పిల్లలు ఇంటికి వస్తున్నారు. వారు పండగ ఆనందంగా గడపడానికి పిండి వంటలు చేస్తుంటారు. అయితే పిండి వంటలకు కావలసిన ముడి సరుకులు అయిన బియ్యం ధరలు పెరగడంతో వంటకాలను తయారు చేసుకోవడానికి మహిళలు వెనుకంజ వేస్తున్నారు.

పొరుగు రాష్ట్రాలకు ఎగుమతితోనేనా...?

జిల్లాలో విస్తారంగా వరిసాగు చేయడంతో వరి పంట దిగుబడి బాగానే ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. అయితే ఇంత పెద్ద మొత్తంలో ధాన్యం పండించిన బియ్యం ధరలకు రెక్కలు రావడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. అమాంతం ధరలు పెరగడంపై పౌరసరఫరాల అధికారులు దృష్టి సారించాలని వినియోగదారులు కోరుతున్నారు. ఏటా వరి ధాన్యం ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నా ఈ సంవత్సరం మాత్రమే ధరలు పెరిగాయని పలువురు పేర్కొంటున్నారు.

పన్ను ఎత్తివేసినా..

జీఎస్టీ అమలులోకి రాకమందు రైస్ మిల్లర్లు వ్యాపారులు క్వింటాల్‌పై నాలుగు శాతం పన్ను చెల్లించేవారు. జీఎస్టీ అమల్లోకి వచ్చాక వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులపై పన్నులను తొలగించారు. బియ్యంపై వ్యాట్‌ను కూడా పూర్తిగా ఎత్తివేశారు. కానీ పన్నులు రద్దు చేసినా బియ్యం ధరలు విపరీతంగా పెరగడం ఆందోళనకు గురిచేస్తోంది.

సన్నరకాల సాగు తగ్గడంతోనే...



సాధారణంగా రైతులందరూ ఖరీఫ్ సీజన్లో ఎక్కువగా దొడ్డు రకం ధాన్యం సాగుచేస్తారు. సన్న రకం ధాన్యం సాగుకు తక్కువగా మొగ్గు చూపారు. ఇక పొరుగు రాష్ట్రాల్లో వాతావరణ పరిస్థితుల ప్రభావంతో పంటలు సరిగా వేయలేకపోవడంతో ఇక్కడి నుంచి ఎగుమతి పెరిగింది. దీంతో సన్న రకాలైన వడ్లకు డిమాండ్ పెరిగింది.

– నల్ల మన్మోహన్‌రెడ్డి, యువ రైతు, నిర్మల్

మధ్యతరగతి వారికి భారం..



ప్రైవేటు రంగంలో పొందుతున్న ఉపాధితో నెల నెలా సరుకులుకొని జీవనం వెళ్లదీసే మాలాంటి మధ్యతరగతి వారికి బియ్యం ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. సగటున క్వింటాల్‌కు రూ.7 వేలు ధర పలుకుతున్నాయి. ధరలు సామాన్యులకు అందుబాటులో ఉంచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– మాన్పురి పోశెట్టి, ప్రైవేటు ఉద్యోగి, చించోలి(బి)

నిత్యావసరాలు	గతేడాది	ప్రస్తుతం (కిలోకు రూ.లలో)
బియ్యం	50	65
పెసర్లు	110	170
మినపపప్పు	120	180
కందిపప్పు	120	180
అల్లం	100	160
వెల్లుల్లి	120	300
బెల్లం	55	75
గోధుమపిండి	45	60
శనగపిండి	75	95

ప్రతిఊరికీ 'సహకార భారతి'

- లోకమాన్య మ్యాక్స్ అధ్యక్షుడు గంగాధర్
- ఘనంగా వ్యవస్థాపక దినోత్సవం

నిర్మల్: ఒకరికొకరు సహకరించుకుంటూ ఆర్థిక పురోగతిని సాధిస్తూ తద్వారా దేశ అభివృద్ధిలో భాగం కావాలన్న లక్ష్యంతో ఏర్పడ్డ సహకార భారతిని గ్రామగ్రామానికి తీసుకెళ్తామని లోకమాన్య మ్యాక్స్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు భూసారపు గంగాధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నటరాజ్‌నగర్‌లో గల ఉమామహేశ్వర ఆలయంలో శనివారం సహకార భారతి వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘచాలక్ నూకల విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ సహకార భారతి 1979లో మహారాష్ట్రలోని పూణేలో ప్రారంభించగా దేశంలోనే అతిపెద్ద ఆర్గనైజేషన్‌గా ఎదిగిందన్నారు. సహకార రంగాలన్నింటినీ సహకార భారతి అనుసంధానం చేస్తుందన్నారు. దేశంలోని 27 రాష్ట్రాలలో 600 జిల్లాల్లో పనిచేస్తుందని వివరించారు. పేద, మధ్యతరగతి కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి, ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి నైతిక విలువలతో పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా సహకార భారతి జెండాను ఎగురవేశారు. ఇందులో లోకమాన్య మ్యాక్స్ సెక్రెటరీ వట్టిమల ప్రభాకర్, వైస్ చైర్మన్ మహాజన్ సతీష్, క్యాషియర్ నల్ల పురుషోత్తంరెడ్డి, బోర్డు సభ్యులు మైసర్ల వెంకటరమణ, తాళ్ళ సుదర్శన్, జాదవ్ వసంత్, షోలాపూర్ రాజేశ్వర్, ఆడెపు సుధాకర్, తోడిశెట్టి పరమేశ్వర్, అద్దండి మహిపాల్‌రెడ్డి, కొయ్యడి రాజేందర్‌రాజు, నూనె ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.


జెండా ఎగురవేస్తున్న సభ్యులు

వైభవంగా గోదారంగనాథుల కల్యాణం


నృత్యం చేస్తున్న చిన్నారి


గోదారంగనాథుల కల్యాణోత్సవం


నృత్యం చేస్తున్న చిన్నారి

నిర్మల్: జిల్లా కేంద్రంలోని దేవరకోట శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలోని పద్మావతి కల్యాణ మండపంలో శనివారం సాయంత్రం గోదారంగనాథుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఉత్సవమూర్తులను భాజాభజంత్రీలు, భక్తుల కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆలయ మాడవీధులలో ఊరేగించారు. ఆద్యంతం గోవిందనామస్మరణతో కల్యాణవేడుక మారుమ్రోగింది. గంగోత్రిధామ్‌కు చెందిన శ్రీరామానుజదాస్, ఆలయ కమిటీ చైర్మన్ ఆమెడ శ్రీధర్, ధర్మకర్తలు, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగు రవికిషన్‌గౌడ్, అర్చకులు నవీన్, రామకన్నన్ తదితరులు పాల్గొన్నారు.


కల్యాణోత్సవానికి హాజరైన భక్తజనం


గోదాదేవికి మంగళ సూత్రాలు వేస్తున్న పురోహితులు


స్వామివారి పల్లకి ముందు యువతుల కోలాటం

సంక్రాంతి పూట.. గంగిరెద్దు బతుకాట

నిర్మల్: పొద్దుపొద్దున్నే.. 'పిపిపిపీ.. పిపిపిపీ..' అంటూ సన్నాయి ఊదుతూ.. 'ఓ తల్లీ.. నీ ఇంటిల్లిపాది సల్లంగుండాలని దీవెనలిచ్చేందుకు నీ వాకిట్లకి బసవన్నచ్చిండు.. ఓ అయ్య.. ఆ ఎములాడ రాజన్నే ఈ బసవన్నను నీ ఇంటికాడకు పంపించిండు..'

'ఓ.. దూడూ బసవన్న.. అగో సూడు బంగారుతల్లి నీకోసం చీర దెచ్చింది. నాకోసం అయ్య తొడుక్కున్న అంగి తీసుకచ్చింది. ఈ ఇంటి పిల్లా తల్లీ.. ఇంటిల్లిపాది సల్లంగుండాలని మనసారా దీవించు..' అంటూ పాటరూపంలో తను పాడుతూ ఉంటే.. ఆ బసవన్న తలఊపుతూ దీవిస్తున్నాడు. సంకురాత్రి సంబురాల్లో గంగిరెద్దుదే తొలి సందడి. గతంతో పోలిస్తే గంగిరెద్దుల సంఖ్య తగ్గింది. ఇప్పుడున్న వాళ్లూ.. ఇక మేమే ఆఖరేమో అంటున్నారు.

- బసవన్న ఆడితేనే.. బతుకు నడుస్తది
- ఊరూవాడా విడిచిపెట్టి..
- అన్ని ఊర్లూ తనవే అన్నట్లు..
- వాడవాడలా తిరిగే 'దూడూ బసవన్న'
- సంక్రాంతి పండుగలో భాగమైన..
- బసవన్నదే తొలి సందడి


భాగ్యనగర్‌లో గంగిరెద్దుల ప్రదర్శన


జిల్లాకేంద్రంలో గంగిరెద్దులను ఆడిస్తూ..

గంగిరెద్దే పెద్దదిక్కు..

గంగిరెద్దంటే.. పరమశివుడి వాహనమైన నందిగా భావిస్తారు. భారీకాయంతో బసవన్నగా పూజలందుకుంటూ తనదైన ఆటతో అందరినీ ఆకట్టుకుంటుంది. ప్రధానంగా సంక్రాంతి వేళ గంగిరెద్దుల సందడి ఎక్కువగా ఉంటుంది. ఇక వాటిని పట్టుకుని ఆడిస్తూ.. వాటినే నమ్ముకుని జీవిస్తున్నవాళ్లను గంగిరెద్దులోళ్లు అని పిలుస్తాం. ఆ బసవడు ఆడితేనే తమ బతుకులు నడుస్తాయని వాళ్లు చెబుతున్నారు. కొన్ని వందల కుటుంబాలకు ఇప్పటికీ ఈ గంగిరెద్దే పెద్దదిక్కుగా ఉంది.

ఊళ్లను పంచుకుని..

అందరూ ఆస్తులను పంచుకుంటుంటే.. వాళ్లు మాత్రం ఊళ్లను పంచుకుంటారు. ఈ ఊరి నుంచి ఆ ఊరి దాకా.. గంగిరెద్దును ఆడించేందుకు వీళ్లకే హక్కు అన్నట్లుగా ముందే పత్రం రాసుకుంటారు. కొన్ని మండలాలకు కొన్ని కుటుంబాలు మాత్రమే ఆడించే హక్కును కలిగి ఉంటాయి. వాళ్లల్లో వాళ్లు రాసుకున్న ఈ పత్రానికీ 'విలువ' ఎక్కువే. ఎవరైనా.. తమ హద్దులు దాటి ఇంకొక్కరి పరిధిలోకి వెళ్తే రూ.లక్షకు పైగా జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఆ విధంగా రాసుకున్న బాండ్‌పేపర్లు, తమ పెద్దలు రాసిచ్చిన పత్రాలనూ వెంట పెట్టుకుని తిరుగుతుంటారు. ఇంట్లో ఆడవాళ్లు బుట్టల్లో పిన్నులు, కాంటలు, బొట్టుబిల్లలు పెట్టుకుని ఊరూరా తిరిగి అమ్ముకుని వస్తారు. ఇలా.. భార్యాభర్త కష్టపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.

ఆ 'కళ' తప్పుతుందేమో..

గంగిరెద్దును ఆడించడం ఓ అరుదైన కళ. ఒక ఎద్దును మచ్చిక చేసుకుని అది తమ మాటకు, పాటకు అనుగుణంగా ఆడటం, చేయడమంటే చాలా క్లిష్టమైన పని. ఇక్కడ ఇంకో ఆసక్తికరమైన విషయం ఉంది. గంగిరెద్దులకు ఆట నేర్పించడానికి వీళ్లలోనే ప్రత్యేక గురువులు ఉన్నారు. 'ఐదేళ్ల కిందట కదిలె పాపన్న దగ్గర ఈ గంగిరెద్దును ఇచ్చిండ్రు. చిన్న గుడ్డను తెచ్చుకుని సాకిన. ఏడాదిపాటు ఆట నేర్చుకునేందుకు కొండగట్టు దగ్గరున్న ఐలాపూర్ కేశవపట్నం గురువు దగ్గరికి పంపిన. రూ.25వేలు తీసుకుని ఆయనే ఏడాది బసవన్నకు తిండిపెట్టి ఆట నేర్పించాడు. ఇప్పుడు ఈ బసవన్న మా కుటుంబానికి తిండిపెడుతున్నడు..' అని గంగిరెద్దును నిమురుతూ నిర్మల్‌లోని మంజులాపూర్‌లో ఉండే కొమురయ్య చెప్పాడు. ఇప్పుడున్న వాళ్లే ఈ ఆటాడిస్తున్నారు. ఇకముందు తరాలు ఇటువైపు వచ్చేలా లేవు. ప్రస్తుతం ఉన్నవాళ్ల పిల్లలందరూ చదువుకుంటున్నారు. తల్లిదండ్రులూ వాళ్లు బాగా చదివి బాగుపడాలనే కోరుకుంటున్నారు.

వలస జీవనం..



పైన నల్లని కోటు వేసుకుని, కింద తెల్లని ధోతి కట్టుకుని, నెత్తికి పాత పట్టు చీరను పట్కాగా చుట్టుకుని.. చేతిలో సన్నాయితో బసవన్నను పట్టుకుని దర్జాగా వచ్చే గంగిరెద్దురోళ్ల జీవితం పైకి కనిపించేంత దర్జాగా లేదు. ఎక్కడెక్కడికో వెళ్తూ.. వలస జీవనం చేస్తూ.. వాడవాడలా తిరుగుతూ.. గంగిరెద్దును ఆడిస్తేనే వారికి పూట గడుస్తుంది. నిర్మల్ జిల్లాలో ప్రస్తుతం ఉన్న గంగిరెద్దురోళ్లు వేములవాడ ప్రాంతం నుంచి వలస వచ్చారు. జిల్లా కేంద్రం శివారుతో పాటు పలు మండలాల్లో చిన్నపాటి గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు.

బసవన్నతోనే బతుకు..



నేను చిన్నగున్నప్పటి నుంచి బసవన్నతోనే ఉన్న. 20–25ఏళ్ల నుంచి గంగిరెద్దు ఆటాడిస్తున్న. ఆ బసవన్న ఆడితేనే మా బతుకులు నడుస్తున్నయ్. మా తర్వాత వాళ్లు ఇట్ల ఇబ్బందులు పడొద్దనే పిల్లలను చదివిస్తున్నం. – కొమురయ్య

ఇంకో పని తెల్వదు..



మా తాతముత్తాల నుంచి గంగిరెద్దును ఆడించడమే తెలుసు. మా తండ్రులు నేర్పిన ఈ విద్య తప్ప మాకు ఇంకో పని తెల్వదు. బసవన్ననే నమ్ముకుని బతుకుతున్నం. ఊరూరు సంచారం చేసుకుంటూ వచ్చిన దాంతోనే బతుకులు వెళ్లదీస్తున్నాం. –మల్లయ్య

ఆదుకోవాలె..



గంగిరెద్దులను ఆడించడమూ ఓ కళనే. తరతరాలుగా వస్తున్న మా బతుకుదెరువుగా మారిన ఈ కళను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం మా కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నాం. –గంట రాములు

క్లుప్తంగా

కరెంట్ షాక్‌తో గేదె మృతి..


మృతిచెందిన గేదెతో రైతు

సోన్: మేతకు వెళ్లిన గేదె కరెంట్ షాక్‌తో మృతిచెందిన సంఘటన మండలంలోని మాదాపూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. రైతు సందీప్‌రెడ్డికి చెందిన గేదె మృతి చెందడంతో సుమారు రూ.80వేల వరకు నష్టం జరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

కర్పూర మకరజ్యోతి దర్శనానికి ఏర్పాట్లు


కడ్తాల్‌లోని అయ్యప్ప ఆలయం

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయం కర్పూర మకర జ్యోతి దర్శనానికి ముస్తాబైంది. ఉమ్మడి జిల్లాలోనే మొదటి అయ్యప్ప ఆలయం కాగా ఇక్కడ సుప్రసిద్ధ శబరిమలై ఆలయం తరహాలోనే పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ గురుస్వామి నర్సారెడ్డి శనివారం తెలిపారు. ఆదివారం సంక్రాంతి వేడుకలు ఉంటాయని, ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం మకర జ్యోతిదర్శన సమయంలోనే ఇక్కడ కర్పూర మకరజ్యోతి దర్శనం ఉంటుందన్నారు.

జింకను హతమార్చిన చిరుత


జింక కళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

భైంసా: మండలంలో చిరుతపులి కలకలం రేపింది. తిమ్మాపూర్ శివారులో ఓ జింకను హతమార్చింది. అటవీశాఖ అధికారులు, గ్రామస్తుల సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన బొర్రొల్ల గోపి పంటచేనులో శనివారం ఏదో జంతువు సగం తిని వదిలేసిన జింక కళేబరం కనిపించింది. ఈ విషయాన్ని గోపి అటవీశాఖాధికారులకు తెలుపగా, వారు వచ్చి పరిశీలించారు. కొద్ది రోజుల క్రితమే పెంచికల్‌పాడ్ గ్రామశివారులో చిరుత కనిపించడంతో జింకను అదే చంపి ఉంటుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు, స్థానికులు ఆందోళన గురవుతున్నారు. పంటచేళ్లకు వెళ్లేప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ పోటీలు


విద్యార్థికి బహుమతి అందిస్తున్న కమిషనర్ భుజంగరావు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ పోటీలు శనివారం నిర్వహించారు. బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ ఆర్.భుజంగరావు హాజరై పోటీలను ప్రారంభించి మాట్లాడారు. చెస్‌తో మేధాశక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థులు చెస్‌పై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. పోటీల నిర్వాహకులను అభినందించారు. ఈ టోర్నమెంట్ విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు..

ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ టోర్నీలో 65 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన ఐదుగురిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. యశ్వంత్(బెల్లంపల్లి), మనీరశ్మిత్(మంచిర్యాల), దేవాన్స్(ఆసిఫాబాద్), జోత్స్న(బెల్లంపల్లి), విశ్వసృజన్(మందమర్రి) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు కరీంనగర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు. అర్జున చెస్ అకాడమీ ఫౌండర్ కోట సుధాకర్, జిల్లా అధ్యక్షురాలు స్వరూప, కోచ్ రాజేంద్రప్రసాద్, కుమురంభీమ్ జిల్లా సాంస్కృతిక సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద గోపాలకృష్ణ, టోర్నమెంట్ కన్వీనర్ దిలీప్‌కుమార్, ఆర్గనైజర్ గోపిరెడ్డి, పల్లెం సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు

ఎదులాపురం: మహిళను వేధింపులకు గురిచేసిన వ్యక్తిపై టుటౌన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. టుటౌన్ అధికారి జీవీ రమణ వివరాల ప్రకారం... ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన వికాస్ స్థానిక నీలనగర్‌కు చెందిన ఓ మహిళను వేధింపులకు గురి చేశాడు. సదరు మహిళ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రాణం తీసిన ప్రేమ వ్యవహారం

- పరువు కోసమే హత్య
- నిందితుల అరెస్టు, రిమాండ్‌కు తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ శివారులో శుక్రవారం జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. కూతురు తండ్రికి ఇష్టం లేని పెళ్లి చేసుకుందనే కోపంతో కుమారుడితో కలిసి వియ్యంకుడిని హత్య చేసినట్లు నిర్ధారించారు. ఈ మేరకు డీఎస్పీ మల్లారెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్ శనివారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిర్మల్ మండలంలోని అనంతపేట గ్రామానికి చెందిన సంటి ప్రవళిక అదే గ్రామానికి చెందిన దగ్గరి బంధువైన పోలీస్ నవీన్‌ను ప్రేమించి ఆరు నెలల క్రితం పెళ్లి చేసుకుంది. ఈ పెళ్లి ఇష్టం లేని ప్రవళిక తండ్రి సంటి భీమన్న తమ ఊర్లో ఉండొద్దని, వేరే చోటికి వెళ్లి బతకమని చాలాసార్లు చెప్పాడు. నవీన్ తండ్రి పోలీస్ బుచ్చన్న(65) వారు ఎక్కడికి వెళ్లరని అనంతపేటలోనే ఉంటారని చెప్పేశాడు. దీంతో భీమన్న పోలీస్ బుచ్చన్న కుటుంబంపై కక్ష్య పెంచుకున్నాడు. అదును కోసం చూస్తున్న సమయంలో శుక్రవారం మధ్యాహ్నం పోలీస్ బుచ్చన్న నిర్మల్‌కు వెళ్లారన్న విషయం తెలుసుకొని బంగల్‌పేట్ శివారులోని జంగల్ హనుమాన్ దగ్గర మాటు వేశారు. బైక్ పైన బుచ్చన్న, అతడి చిన్నల్లుడు పడాల వెంకటేష్ రావడంతో వారిపై భీమన్న,ప్రమోద్ దాడి చేశారు. బుచ్చన్న తలపై తీవ్ర గాయాలు కావడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేష్ సైతం చనిపోయాడని నిందితులిద్దరూ అక్కడి నుండి పరారయ్యారు. పోలీసులు సీసీ కెమెరాలు, సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా దర్యాప్తు చేయగా భీమన్న, ప్రమోద్ నిందితులుగా తేల్చారు. శనివారం మండలంలోని కొండాపూర్ హైవేపై నిందితులను అరెస్టు చేశారు.

కొడుకు టీషర్టు వేసుకున్న అల్లుడు..

ఈ ఘటనలో కొడుకు టీ షర్టు వేసుకున్న అల్లుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. పోలీస్ బుచ్చన్న రెండవ అల్లుడు వెంకటేష్ ఆదిలాబాద్‌లో ఉంటాడు. సంక్రాంతి పండుగకు అత్తగారింటికి వచ్చాడు. శుక్రవారం తన బావమరిది నవీన్‌కు చెందిన టీ షర్టు వేసుకొని తన మామ పోలీస్ బుచ్చన్నతో కలిసి నిర్మల్ బయలుదేరాడు. మార్గమధ్యంలో వెంకటేష్‌ను నవీన్ అనుకొని నిందితులు దాడి చేశారు. దీంతో అతనికి తీవ్ర గాయాలై ప్రస్తుతం జిల్లా కేంద్రంలో చికిత్స పొందుతున్నాడు. రెండవ నిందితుడు సంటి ప్రమోద్ జిల్లా కేంద్రంలో పాలిటెక్నిక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడని, పరువు కోసం హత్య చేసి జీవితాన్ని దుర్భరం చేసుకున్నాడన్నారు. 24గంటల్లో కేసును ఛేదించిన సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

మేకల కాపరిపై గొడ్డలితో దాడి

- తీవ్ర గాయాలతో రిమ్స్‌లో చికిత్స..
- అనుమానితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు


గాయపడిన శంకర్

గుడిహత్నూర్: ఎప్పటి మాదిరిగానే చేనులో మేకలు మేపుతున్న కొల్హారీ గ్రామానికి చెందిన బెద్రె శంకర్ (55) శనివారం గుర్తు తెలియని యువకుల గొడ్డలి దాడికి పాల్పడగా ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. బాధితుడు ఎప్పటిలాగే గ్రామానికి చెందిన చందాపురే సందీప్ చేనులో చెట్టుకొమ్మలు కొడుతూ మేకలకు అందిస్తున్నాడు. ఈ క్రమంలో ఇద్దరు యువకులు వచ్చి తాము పేకాట ఆడడానికి వచ్చామని స్థలం కోసం చూస్తున్నామని, మీ గొడ్డలి ఇవ్వండి అంటూ అడిగారు. దీంతో బాధితుడు గొడ్డలి ఇచ్చాడు. దీంతో ఒక్కసారిగా వెనుక నుంచి అతడిపై దాడికి దిగాడు. దీంతో శంకర్ అరవడంతో పక్క చేనులో పత్తి ఏరుతున్న ఇద్దరు మహిళలు అక్కడకు వెళ్లగా దుండగులు పారిపోయారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు అక్కడికి చేరుకుని ఆటోలో రిమ్స్‌కు తరలించారు. అయితే శంకర్‌పై 9 చోట్ల కత్తి, గొడ్డలి గాయాలు ఉన్నాయని, 98 కుట్లు వేశామని, మరో 48గంటలు గడిస్తేగాని చెప్పలేమని రిమ్స్ వైద్యులు చెప్పారు.

అదుపులోకి తీసుకొని సాగుతున్న విచారణ...

విషయం తెలుసుకున్న ఎస్సై ఇమ్రాన్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, సీఐ చంద్రశేఖర్‌లు పోలీసు స్టేషనుకు చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. పాత కక్షలు, కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ హత్యాయత్నం జరిగిందా? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. అనుమానితులుగా ఉన్న మన్నూర్‌కు చెందిన పలువురు యువకులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. త్వరలో కేసును ఛేదిస్తామని డీఎస్పీ వెల్లడించాడు.

మానసిన స్థైర్యానికి క్రీడలు దోహదం

నార్నూర్: యువతకు చదువు ఎంత ముఖ్యమో.. మానసిక స్థైర్యానికి క్రీడలు అంతే ముఖ్యమని దీక్ష గురువు శ్రీ సంత్ ప్రేంసింగ్ మహారాజ్ అన్నారు. ఈ నెల 6న మండలంలోని కొత్తపల్లి-హెచ్ జాతీయ బంజారా వద్ద నిర్వహించిన గురు కృప దినోత్సవం సందర్భంగా కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మొదటి బహుమతిగా రూ.25000, బీజేపీ యువ నాయకుడు రితేష్ రాథోడ్ రూ.16000 ద్వితీయ బహుమతి మహారాజ్ చేతుల మీదుగా విజేతలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో క్రమశిక్షణ అలవర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కమిటీ నిర్వహకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

తాంసి: అనారోగ్యంతో ఉరేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన భీంపూర్ మండలంలోని పిప్పల్ కోటి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అనార్పు గణపతి (51) వ్యవసాయ కూలీగా పని చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. కొంత కాలంగా కడుపునొప్పితో పాటు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై శనివారం సాయంత్రం ఇంటి వద్ద ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య కిష్టమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లాల్ సింగ్ నాయక్ తెలిపారు.

జీవితంపై విరక్తితో..

ఖానాపూర్: జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. ఏఎస్సై మనిరామ్ వివరాల ప్రకారం.. మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన సాతం భీమన్న(40) భార్య కవిత ఆరు నెలల క్రితం తన ఇద్దరు పిల్లలను తీసుకొని పుట్టింటి వెళ్లి తిరిగి రావడం లేదు. భార్య రావడం లేదని జీవితంపై విరక్తితో శనివారం సాయంత్రం ఇంట్లోని దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

లక్ష్మణచాంద: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... నేరడిగొండ మండలం రాజుర గ్రామానికి చెందిన జాదవ్ అంబరావు శనివారం మామడ మండలం కమల్ కోట్ తండాకు బంధువుల ఇంటికి వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. మండలంలోని చామన్‌పెల్లి -చింతల్‌చాంద మధ్య వంతెనపై వెనుక నుంచి మరో బైక్ వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో అంబరావు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన చింతల్‌చాంద గ్రామానికి చెందిన షేక్ ఆశ్వక్ అహ్మద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

హీరసుక జయంతి నిర్వహిద్దాం

ఇంద్రవెల్లి: ఆదివాసీ ప్రధాన్ సమాజ్ కుల గురువు గోండి ధర్మగురు హీరసుక జయంతి ఫిబ్రవరి 26న మండల కేంద్రంలో వైభవంగా నిర్వహిస్తామని ఆదివాసీ ప్రధాన్ పురోహిత్ సంఘం నాయకులు, ఆ సమాజ్ పెద్దలు తీర్మానం చేశారు. శనివారం మండల కేంద్రంలోని కాగ్నే ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి జిల్లా ప్రధాన్ సమాజ్ పెద్దలు, ఉద్యోగ సంఘం నాయకులు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో హీరసుక జయంతి నిర్వహించడానికి తీర్మానం చేసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెస్రం మనోహర్, ఇంద్రవెల్లి ప్రధాన్‌గూడ పటేల్ గేడం జ్ఞానేశ్వర్, ప్రధాన్ సంఘం జిల్లా ఉద్యోగస్తుల సంఘం ఉద్యోగస్తులు మడావి శంకర్, ఆడా నగేష్, మరప గోవింద్‌రావ్, ప్రధాన్ సమాజ్ పెద్దలు ఆర్క ఖమ్ము ఉన్నారు.

సంక్రాంతి బుడుబుంగలు

- చిల్లర నాణేలు, రేగిపండ్లను తలపై పోస్తారు
- నేటికి కొనసాగుతున్న సాంప్రదాయం
- సంక్రాంతి రోజున ముగ్గుల పోటీలు


పతంగులను కొనుగోలుచేస్తున్న దృశ్యం

భైంసా: బుడుబుంగలు... ఈ ప్రాంతంలో ఈ పదం బోగి రోజున అందరినోట వినిపించే మాట. బోగి పండ్లు (బుడుబుంగలు) ప్రతీ ఇంట్లో ఐదేళ్లలోపు పిల్లలకు పోయడం ఆనవాయితీ. నేరేడి(రేగు) పండ్లు, చిల్లర నాణేలు ఈ సీజన్‌లో చేతికి వచ్చే పచ్చి శెనగకాయ, చెట్లకు కాసే జీడిపండ్లు, జామపండ్లు, బంతి పువ్వులు ఇలా ఐదింటిని ఒకచోట కలిపి ఉంచుతారు. బోగి పండుగ రోజున సాయంత్రం ఐదేళ్లలోపు పిల్లలను ఇంటి మధ్యలో కూర్చోబెడుతారు. ఉదయాన్నే పిల్లలకు తలంటి స్నానంచేయించి కొత్త బట్టలు వేస్తారు. మధ్యలో పీట వేసి దానిపై కొత్త వస్త్రం పరిచి అందులో పిల్లలను కూర్చోబెడుతారు. ఇంటి పక్కన పిల్లలను అందరిని పిలుచుకువచ్చి వస్తారు. ఇంట్లో పెద్దలు ఐదేళ్లలోపు పిల్లలను కూర్చోబెట్టి తిలకంపెట్టి హారతి ఇస్తారు. అనంతరం ఇంట్లో ఐదు రకాలతో కలిపి ఉంచిన ఈ బోగి పండ్లను తలపై నుంచి పోస్తారు. పిల్లలంతా వాటిని పోగుచేసి ఒకచోట చేరుస్తారు. ఇలా ఈ పండ్లనే ఐదు సార్లు వేస్తారు. తర్వాత అక్కడికి వచ్చిన పిల్లలకు వాటిని పంచిపెడుతారు.

ఆనవాయితీగా...

బోగినాడు ఈ పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఇలా చేస్తే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని దీర్ఘ ఆయుష్షుతో కలకాలం జీవిస్తారని పెద్దల నమ్మకం. ఐదేళ్లలోపు పిల్లలకు ఇప్పటికీ బోగి పండ్లను పోయడం ఈ ప్రాంతం ప్రత్యేకత.

కనుమ రోజున కనువిందు....

ఆంగ్ల సంవత్సరంలో తెలుగువారి మొదటి పెద్ద పండగ సంక్రాంతి. ఏ వీధిన చూసిన రంగవల్లుల సోయగాలు. చిన్నాపెద్దా తేడాలేకుండా అంతాకలిసి ఈ పండుగ చేసుకుంటారు. బోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజుల పండుగ కొనసాగుతోంది. సంక్రాంతి పండుగకు ముందే ఈ ప్రాంతంలో రకరకాల నోములను వ్యాపారులు విక్రయిస్తుంటారు. పిల్లలకు సైతం ఇచ్చేలా ఆట వస్తువులు, బొమ్మలు, పెన్నులు విక్రయిస్తున్నారు. వంట గదిలో ఉపయోగపడే చిన్నపాటి పాత్రలు, పూజ గదిలో వినియోగించే వస్తువులు ఇలా వాటిని కొనుగోలుచేసి సంక్రాంతి రోజున మహిళలు పూజలుచేస్తారు. కనుమ రోజున ఇళ్లకు వెళ్లి నువ్వులు, బెల్లంతో కలిపిన ఉండలను నోట్లోపెట్టి నోటిని తీపిచేస్తారు. తోటి మహిళలకు నోములను (వాయినం) ఇచ్చి పుచ్చుకుంటారు. కనుమరోజున ఎక్కడ చూసిన ఈ దశ్యాలే కనిపిస్తుంటాయి.

రైతులకు పండుగే...

సంక్రాంతి మరునాడు జరుపుకునే పండుగ కనుమ. హిందూ సాంప్రదాయంలో పశుపక్షాదులకు విశేషస్థానం ఉంది. వ్యవసాయానికి పశుసంపదే ప్రధానం. వాటి శ్రమను గుర్తించి గౌరవించడం ఈ పండగ ప్రత్యేకత. శివుడి వాహనం, నంది, వినాయకుడి వాహనం మూషికం. సుబ్రహ్మణ్యస్వామి వాహనం నెమలి ఇలా సమస్త జంతుజాలాన్ని ఆదారణపరంగానే ప్రత్యేకంగా పూజిస్తారు. పెద్ద పండుగైన సంక్రాంతి రోజున సమస్త దేవతలకు మూలంగా భావించే గోవులను పూజిస్తారు. రైతులంతా ఆ రోజున ఉదయాన్నే లేచి పశువుల కొట్టాలు శుభ్రం చేస్తారు. కలాపిచల్లి పశువుల కొట్టాన్ని బియ్యం పిండితో ముగ్గులువేసి గొబ్బెమ్మలను పెడుతారు. పాలిచ్చి పోషించే ఆవులు వ్యవసాయంలో ఉపయోగపడే ఎడ్లను శుభ్రంగా కడిగి దిష్టితీసి గుమ్మడికాయ పగుల గొట్టి గజ్జెలు, పూలదండలు వేసి చక్కగా అలంకరిస్తారు. రైతులు, పాలేర్లు కలిసి పంట పొలాల్లోనే ఆ రోజు వండుకుని తింటారు. వండిన నైవేద్యాన్ని పశువులకు చూయించి అక్కడే తిని పండుగ చేసుకుంటారు. సంక్రాంతి తర్వాత కనుమను ఈ ప్రాంతంలో మహిళలు, రైతులు ఎంతో ఉత్సాహంతో జరుపుకుంటారు.

లక్కీ డ్రా పేరుతో మోసం..

నిర్మల్‌రూరల్: లక్కీ డ్రా పేరుతో ఓ మహిళను నమ్మించి మూడు తులాల బంగారం కాజేసిన ఘటన జిల్లా కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం... జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీకి చెందిన ఒల్లెపురాధ ఇంటికి శనివారం గుర్తు తెలియని వ్యక్తి వచ్చి గతంలో మీరు షోరూంలో టూవీల్లర్ కొన్నారు కాబట్టి లక్కీ డ్రా లో రెండు తులాల బంగారం వచ్చిందని నమ్మ నమ్మబలికాడు. నావద్ద ఐదు తులాల బంగారం బిస్కెట్ ఉందని, మిగిలిన మూడు తులాల బంగారు ఆభరణాలు ఇస్తే ఐదు తులాల బంగారం బిస్కేటు ఇచ్చేస్తానని ఆమెకు నమ్మించాడు. సదరు వ్యక్తి మాటలు నమ్మిన రాధా ఒంటిపై ఉన్న పుస్తెల తాడు, కమ్మలు, ఇతరాత్ర మూడు తులాల విలువ చేసే బంగారు ఆభరణాలను తీసి ఇచ్చేసింది. వీటిని తూకం వేసి నా వద్ద ఉన్న బంగారు బంగారాన్ని ఇస్తానని మల్లెపురాధ కుటుంబ సభ్యుడిని తీసుకొని బైక్ పై బయలుదేరాడు. స్థానిక సబ్ రిజిస్ట్రేషన్ దగ్గర ఉన్న ఓ బంగారు దుకాణానికి వెళ్లగా తన వెంట వచ్చిన వ్యక్తిని బయట ఉండమని చెప్పి అక్కడి నుంచి తప్పించుకొని పరారయ్యాడు. దీంతో తాము మోసపోయామని గ్రహించి పట్టణ పోలీసులను సంప్రదించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి విక్రయ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని టుటౌన్ పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు. టుటౌన్ సీఐ అశోక్ కథనం ప్రకారం.. గత డిసెంబర్‌లో గంజాయి విక్రయ కేసు నమోదు కాగా నిందితుడు పరారీలో ఉన్నాడు. శనివారం పట్టుబడగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. గంజాయి సాగుచేసినా.. విక్రయించినా కేసులు తప్పవన్నారు.